

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : సద్గురు శ్రీ నాన్నగారు



సంపుటి : 10 | సంచిక : 8 | పుష్యం : 17-18 | 05-01-2005

రమణ భాస్కర

ఆధ్యాత్మిక పక్ష పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥100/-

విడి ప్రతి : రు॥ 8/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551

ఈ సంచికలో....

28-11-04

పాతాళమెరక ........... 1

01-12-04

చిన అమిరం .......... 10

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, ☎ 08814 - 228858

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 28-11-04, పాతాళమెరక

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

అపరావిద్యలు అంటే ఈలోకానికి సంబంధించిన విద్యలు నేర్చుకోవటానికయినా, పరావిద్య నేర్చుకోవటానికయినా శ్రద్ధ ఉండాలి. శ్రద్ధ వలన మాత్రమే జ్ఞానం లభిస్తుంది అని భగవంతుడు చెప్పాడు. శ్రద్ధ లేకపోతే ఏదీరాదు. పరతత్వం మాట అటు ఉంచండి, ఈ లోకంలో మనం అభివృద్ధిలోనికి రావాలన్నా వినయం అవసరం, విశ్వాసం అవసరం, భక్తి అవసరం, శ్రద్ధ అవసరం. జీవితంలో మనం అభివృద్ధి లోనికి రావాలంటే కృతజ్ఞతాభావం కూడా ఉండాలి. మనం ఎవరివలన అయినా అభివృద్ధిలోనికి వచ్చాము అనుకోండి వారిపట్ల కృతజ్ఞత కలిగి ఉంటే ఈశ్వరుని కృపకు పాత్రులవుతాము. మనం మంచి పనులు చేయటం ఎందుకు అంటే అవే గమ్యం కాదు అయినా మనం చేసే మంచి పనులు మనలను గమ్యం దగ్గరకు తోలుకొనిపోతాయి. మనకు జయం వచ్చినప్పుడు సంతోషిస్తున్నాము, అపజయం వచ్చినప్పుడు బాధ పడుతున్నాము. అంటే జయం వచ్చినప్పుడు ఒకరకంగా, అపజయం వచ్చినప్పుడు ఒకరకంగా ఉంటున్నాము. ఇలా హెచ్చుతగ్గులుగా ఉండటానికి కారణం మనలో ఉన్న మిథ్యానేను.

ఈ ప్రపంచం అంతా మిథ్య అంటున్నారు, ఉన్నదేదో ఉంది లేనిది ఏదో లేదు, ఉన్నదానికి లేకపోవటం అంటూ లేదు, లేనిదానికి ఉండటం అంటూ లేదు అని భగవంతుడు చెప్పాడు అని ఒకసారి రామకృష్ణమఠం స్వామీజీతో మాట్లాడుతూ అన్నాను. స్వామీజీ ఏమన్నారు అంటే అది తత్వం, అది నిజమే కాని ఆతత్వాన్ని, మనం అందుకోవాలికదా. ఆతత్వాన్ని మనం అందుకోవటానికి స్వార్థంలేని పనులు చేయాలి. నిష్కామకర్మ చేస్తూ ఉంటే ఒకవేళ ఇదంతా మిథ్య అయినప్పటికీ దీనివలన మనకు చిత్తశుద్ధి కలుగుతుంది. ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగినా, చెడ్డ జరిగినా, పొరపాటు జరిగినా, నాశనం జరిగినా దానికి

మానవుడిలో ఉన్న స్వార్థమే కారణం. మనం మంచి పనులు చేస్తేగాని, భగవంతుడిని స్మరించుకొంటేగాని మనకు స్వార్థం తగ్గదు. మీరు చెప్పే తత్వం నిజం అయినప్పటికీ మనం మంచిపనులు కూడా చేస్తూ ఉండాలి. మంచిపనులు చేయటం ద్వారా చిత్తశుద్ధి కలుగుతుంది, ఆచిత్తశుద్ధి ద్వారా మనం మోక్షం పొందవచ్చు. అందుచేత ఇవన్నీ కాదనటానికి వీలులేదు. మనం పొందవలసింది ఏదో పొందేవరకు ఇవికూడా విడిచిపెట్టకూడదు. వీటిని విడిచిపెట్టేసి, మనం పొందవలసిందీ పొందకపోతే మనకు ఉభయభ్రష్టుత్వం వస్తుంది. అటూకాకుండా పోతాం, ఇటూ కాకుండా పోతాం. మనం చేయవలసింది ఏమిటి అంటే మన ధర్మం మనం నిర్వర్తించాలి, సమాజం మనకు ఎంతోకొంత సహకరిస్తోంది కాబట్టి మనం సమాజఋణం కూడా తీర్చుకోవాలి. నువ్వు మంచి పనులు చెయ్యి, అంతమాత్రంచేతనే ఆత్మజ్ఞానం కలుగుతుందని అనుకోవద్దు. నువ్వు విచారణ చెయ్యాలి. మంచిపనులతోపాటు విచారణ విడిచిపెట్టకూడదు. లోకవిచారణ వలన నీకు ఆత్మజ్ఞానం కలుగదు, ఆత్మవిచారణ వలన నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది.

ప్రతీ మనిషీ ఏదో అశాంతితో బాధపడుతున్నాడు. అందరికీ దారిద్ర్యం బాధలేదు, కొంతమంది డబ్బు ఉండి, కొంతమంది అధికారం ఉండి బాధపడుతున్నారు, ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటి అంటే మీకు ఎంత గౌరవం ఉన్నా, మీరు ఎన్ని మంచిపనులు చేసినా, మీకు ఎంత ధనం ఉన్నా ఈదేహమే ఆత్మ, ఈదేహమే సత్యం అనుకొన్నంతకాలం, దేవుడు వేరు నేను వేరు అనే బేధబుద్ధి నీకు ఉన్నంతకాలం ఈజన్మకాదు కదా, నీవు కోటిజన్మలు ఎత్తినా నీకు దుఃఖం వెంటాడుతుంది, అశాంతి వెంటాడుతుంది, దుఃఖం నిన్ను విడిచిపెట్టదు ఇందులో రాజీలేదు అంటున్నారు. దుఃఖం బయటలేదు, అశాంతి బయటలేదు. ఇది మీరు బాగా అర్థం చేసుకోండి. భగవాన్ విషయం చెప్పటంలో రాజీపడరు, నిర్మొహమాటంగా చెపుతారు. మనం నిష్కామ కర్మ చేస్తున్నాము అనుకోండి, మన మనస్సు, మాట, చేత ఏకంగా ఉంది అనుకోండి మనం చేసేది ఆడంబరం కోసం కాకుండా నిర్మలంగా, నిశ్చలంగా, నిరహంకారంగా చేసుకొంటూపోతున్నాము అనుకోండి సాధనపేరు మీద కష్టాలు అక్కరలేదు. నిద్రపోతున్న మనిషి వెలుకువ వచ్చేటప్పుడు ఎంత ప్రశాంతంగా మేలుకొంటాడో మీ ప్రవర్తన సరిగా ఉంటే బ్రహ్మజ్ఞానం కూడా మీకు అలాగ వస్తుంది. కూర్చోలేకపోతున్నాము, సాధన చేయలేక పోతున్నాము, మాకు మోకాళ్ళనొప్పులు అంటారు. వైరభావం లేకుండా ఉండటం, అసూయకు దూరంగా ఉండటం, ఈశ్వరునిపట్ల భక్తి కలిగిఉండటం ఇవి ఏమీ లేకుండా కూర్చోలేక పోతున్నాను, మోకాళ్ళనొప్పులు అంటావు ఏమిటి? ఇవన్నీ చేస్తూ ఉంటే, నీ జీవనవిధానం సరిగాఉంటే ఏదో కష్టపడిపోతున్నాము, బాధపడిపోతున్నాము, సాధన చేయలేకపోతున్నాము ఈ గొడవ అక్కరలేదు. నిద్రపోతున్న మనిషి మేల్కోవటానికి ఏమీ బాధపడడు, వాడు ప్రశాంతంగా మేల్కంటాడు. మీ జీవితం సరళంగా ఉంటే నిద్రపోతున్న మనిషి ఎంత ప్రశాంతంగా మేల్కంటాడో అంత ప్రశాంతంగా మీకు బ్రహ్మజ్ఞానం కలుగుతుంది.

మనకు అజ్ఞానం ఉందా, లేదా అని ఎవరిని అడగనక్కరలేదు. మీరు వేరు నేను వేరు, నేను వేరు ఈ లోకం వేరు, నేను వేరు దేవుడు వేరు అనే వేరుభావన మనకు ఉంది. కొన్నివేలజన్మల నుండి వస్తున్నటువంటి అజ్ఞానము యొక్క పాకమే ఈబుద్ధి. మనం అజ్ఞానంలో శుభ్రంగా ముదిరిపోయి ఉన్నాము. ఆవేరుభావన నీకు ఉందంటే నీలో అజ్ఞానం ఉన్నట్లే. నాలో అజ్ఞానం ఉంది అని అనుకోవటం వలన ప్రయోజనం లేదు, దానిని ఎలా తొలగించుకోవాలో చూసుకో. మన అందరి హృదయాలలో భగవంతుడు ఉన్నాడు. మన ప్రారబ్ధాన్ని బట్టి మనలను ఆడిస్తున్నాడు. ఆయన చేసే పని సైలెంట్‌గా చేస్తున్నాడు, గుర్తింపుల కోసం చేయటం లేదు. భగవంతుడు ఎలాగ పనిచేస్తున్నాడో అలాగ పనిచేయటం నేర్చుకొంటే నీలో ఉన్న అజ్ఞానం నీకు తెలియకుండానే దానంతట అదే రాలిపోతుంది, దానిని తొలగించు కోవటానికి నీవు ప్రత్యేకంగా ప్రయత్నం చేయనక్కరలేదు. ఈమధ్యన ఒక ఆశ్రమంలో పెత్తనం చేసే మనిషిని చూసాము, వచ్చిన వారిని రిసీవ్ చేసుకోవటం, కాఫీలు, భోజనాలు పెట్టించటం, వారికి మర్యాద చేయటం ఆయన చేసేపని అది, అక్కడకు వచ్చినవారు ఈయనతో స్వామీ మీరు చాలా కష్టపడుతున్నారు అనటం, ఆయనేమో పొంగిపోవటం ఇవన్నీ జరుగుతున్నాయి. ఆశ్రమానికి ఒక బుద్ధిమంతుడు వచ్చాడు. అతడు స్వామీజీతో ఏమండోయ్ మీరు కష్టపడిపోతున్నారు, చివరకు మీకు గౌరవం వచ్చేస్తుంది అని మీరు అనుకొంటున్నారు. ఒకవేళ గౌరవం వస్తే రావచ్చుగాని జ్ఞానంమటుకు రాదు, చివరకు మిగిలేది చెమట అని చెప్పాడు. ఏదో తగు మాత్రంగా డ్యూటీ మీరు చేసుకోండి, తరువాత విచారణ చేసుకోండి, మనస్సుకు లోచూపు కలుగజేయండి. మీరు చేసేపని నిర్మలంగా చేయండి, నేను వద్దనటం లేదు, మీరు పొందవలసిన దానికి, దీనికి ఏమీ సంబంధంలేదు అదీ ఆయన చెప్పింది.

ప్రపంచంలో ఏ మనిషి అయినా వాడు డబ్బు సంపాదించినా, ఉద్యోగం చేసినా, బాగా చదువుకొన్నా, వ్యవసాయం చేసినా అందరూ కూడా సుఖంగా ఉండటం కోసమే చేస్తున్నారు. వాడు దుఃఖం రాకూడదు సుఖంగా ఉండాలి, అశాంతి రాకూడదు శాంతిగా ఉండాలి అని అనుకొంటాడు, ఏ పని చేసినా దాని కోసమే చేస్తాడు. కాని వారు శాంతిగా ఉంటున్నారా ఇది మీరు గ్రహించాలి. మనం నేర్చుకొనే విద్యవలన శరీరానికి కంఫర్టు వస్తోంది కాని మనకు శాంతి రావటం లేదు. ప్రతీ మనిషి కోరుకొనేది దుఃఖనివృత్తి, సుఖప్రాప్తి కాని ఆ సుఖం ఎక్కడ ఉందో మనకు తెలియటం లేదు. విషయచింతనలో, భోగప్రవృత్తిలో మీకు దుఃఖం తగ్గదు, దుఃఖం పెరిగిపోతుంది, సుఖప్రాప్తిరానే రాదు. ఏ వస్తువులో అయితే సుఖం ఉందో ఆ వస్తువును పొందిన తరువాత మాత్రమే వాడు సుఖి అవుతాడు. ఎక్కడ సుఖం ఉందో అక్కడ వదిలేసాము, సుఖం లేనిచోట సుఖంకోసం వెదుకుతున్నాము. ప్రతి మనిషీ నాకు దుఃఖం రాకూడదు, శాంతిగా సుఖంగా ఉండాలి అనుకొంటున్నాడు కాని ఆ సుఖాన్ని, శాంతిని పొందలేకపోతున్నాడు. నీకు శవబుద్ధి ఉన్నంతకాలం, అసత్యం

పట్ల సత్యబుద్ధి ఉన్నంతకాలం, ఏ వస్తువు అయితే నీకు దుఃఖాన్ని తీసుకొని వస్తోందో దానిలో సుఖం ఉందని అనుకొన్నంతకాలం నీకు వచ్చేది దుఃఖమే, సుఖం రానే రాదు. ఇలా జీవిస్తున్నంతకాలం ఇప్పడే కాదు లక్షజన్మల తరువాత కూడా నీవు సుఖాన్ని పొందలేవు. కాలప్రవాహంలో కొట్టుకొనిపోయే వాటిమీద మమకారం పెంచుకొంటున్నాము. అన్నీ కాలప్రవాహంలో కొట్టుకొని పోతాయి, నిలబడేది ఒక్క సత్యం మాత్రమే, అది నీ హృదయంలో ఉంది. అది నీ ఇంద్రియాలకు అందదు, నీ మనస్సుకు అందదు, నీ పాడుబుద్ధికి అందదు. కొంతమంది మేము తెలివైనవారము అనుకొంటారు, వారికి అసలే అందదు. అందకపోతే మాకు ఆ వస్తువు అందటం లేదు అని ఏడ్చినా ఫరవాలేదు అసలు ఆ వస్తువే లేదు అంటున్నారు.

మన హృదయంలో ఒక సత్యవస్తువు ఉంది, అది మనకు అందటం లేదు అంటే మన ప్రవర్తనలో ఏదో తేడా ఉంది, మన ఆలోచనలో తేడా ఉంది అని అనుకోవటం లేదు అసలు ఆ వస్తువే లేదు అంటున్నాము, మనం ఇలా తయారయ్యాము, దీనికి కారణం మనకు శాస్త్రంయందు గౌరవం లేదు, భగవంతుడు చెప్పిన మాటయందు విశ్వాసం లేదు, భక్తి లేదు. ఇది అంతా మన పాడుబుద్ధికి గుర్తు. పోనీ దేవుడి మాట వదిలేయండి, మంచిపనులు చేసేవారు మన కళ్ళ ఎదురుగా కనిపిస్తున్నారు కదా కనీసం వారిని కూడా మనం గౌరవించము, సత్పురుషులను గౌరవించము, భగవంతుడు ఉన్నాడు అనే విశ్వాసం మనకు లేదు ఇంక మనకు ఆత్మజ్ఞానం ఏమిటి? సత్పురుషులు అంటే ఎవరు అనుకొంటున్నారు, సమాజ క్షేమం కోసం పనిచేసేవారు అంటే ఎవరు అనుకొంటున్నారు వారు భగవంతుడి ప్రతినిధులు. మీ కళ్ళకు కనబడే వారినే గౌరవించలేనప్పడు ఇంక మీరు భగవంతుడిని ఏమి గౌరవిస్తారు? ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటి అంటే నువ్వు కోటి పూజలు చెయ్యి, కోటి పుణ్యాలు చెయ్యి, నేను వద్దని చెప్పటం లేదు, అంత మాత్రంచేతనే దుఃఖం ఆగిపోతుంది, వేదన ఆగిపోతుంది, ఈ జన్మచక్రం ఆగిపోతుంది అని ఇటువంటి పిచ్చిపిచ్చి తలంపులు ఏమీ పెట్టుకోవద్దు, అవి ఆగవు. నీ హృదయంలో ఉన్న సత్యవస్తువు నీకు గోచరమయ్యే వరకూ, ఇప్పడు నీవు శరీరంతోటి ఇంద్రియాలతోటి ఎలా తాదాప్యం పొందుతున్నావో అలాగ లోపల ఉన్న సద్వస్తువుతో పూర్తిగా తాదాప్యం పొందేవరకూ దుఃఖం నిన్ను విడిచిపెట్టదు, జన్మలు నిన్ను విడిచిపెట్టవు. ఈ లోపుగా మనం పాపం చేసినా, పుణ్యం చేసినా వాటిని అనుభవించ వలసిందే. ఎవరికైనా కేన్సర్ జబ్బు వచ్చింది అనుకోండి, ఏదో పైన కొబ్బరినూనె రాసుకొంటున్నాము అంటే కొబ్బరినూనె రాసుకోవటం వలన కేన్సర్ తగ్గిపోతుందా? అక్కడ ఏదో వేపచెట్టువేసాము. ఇక్కడ నుయ్యి తవ్వించాము మాకు జ్ఞానం వచ్చేస్తుంది అంటే వీటి వలన మీకు జ్ఞానం వస్తుందా? అసలు మీరు లోపలకు వెళ్ళాలి కదా. దానికి అసలు మీకు వైరాగ్యం ఉందా, అభ్యాసం ఉందా? రోడ్డుమీద వెళుతూ ఉంటే ఎక్కడ గడ్డిమేటు కనిపిస్తే ఇటువంటి గడ్డిమేటు నాకు ఉంటే బాగుండును అనుకోవటం, ఎన్ని గడ్డిమేట్లని తింటారు. మీకు కొంచెమైనా వైరాగ్యం ఉండాలి కదా, అభ్యాసం ఉండాలి కదా. మీకు

మోకాళ్ళనొప్పలు ఉన్నాయి సరే ఏమీ చేయలేకపోతున్నారు, వైరాగ్యానికి ఏ నొప్పలు అడ్డు వస్తున్నాయి. మనం సజ్జనులం కాకపోయినా సజ్జనులను గౌరవించే అలవాటు మనకు లేదు. అన్నీ మనకే తెలుసు అనుకొన్నప్పడు ఇంక మనం ఎవరిని గౌరవిస్తాము.

మేము దుఃఖాన్ని భరించలేకపోతున్నాము అంటారు. దేహాభిమానం పోయింది అనుకోండి, దేహమే ఆత్మ అనుకొనే బుద్ధి నశించింది అనుకోండి మీకు ఎంత దుఃఖం ఉన్నా ఆ దుఃఖం అంతా సుఖంగా మారిపోతుంది, అశాంతి అంతా శాంతిగా మారిపోతుంది, ఆనందసాగరంలో ఓలలాడుతూ ఉంటారు, ఆ స్థితిని మీరు పొందాలి. సజ్జనులు నీకు ఆడంబరంగా కనబడరు, మిమ్మల్ని ఉద్ధరిస్తాము అని ఆడంబరం మాటలు చెప్పరు. అలాగని వారికి ఏమీ చేతకాదు, ఏమిటి పిచ్చివారు కింద ఉన్నారు అని అనుకోవద్దు. సత్పురుషులు మౌనంగా పని చేస్తారు, వారి ద్వారా జరిగే సహాయం మీకు తెలియాలి అని వారు అనుకోరు. ఇప్పడు మనకు సత్పురుషులు గురువులుగా కనబడటం లేదు, బడాయివారు అందరూ గురువులుగా కనబడుతున్నారు. గురువు మనకు మౌనంగానే బోధిస్తాడు. అవసరమయితే మాట చెపుతాడు. గురువు చేసేది నిర్మలంగా చేస్తాడు, అది అనుగ్రహపూరితంగా ఉంటుంది. ఆయన చేసే సహాయం మన మనస్సుకు అందదు. గురువు అంటే ఎవరోకాదు భగవంతుడే ఆరూపంలో వస్తాడు, భగవంతుడి యొక్క ప్రతినిధే గురువు. గురువును నీవు గౌరవించేటప్పడు కూడా గురువు అంటే ఆత్మ, అమృతానుభవం పొందినవాడు, తాను పొందిన అనుభవాన్ని మనకు పంచటానికి వచ్చాడు అనే భావన నీకు ఉండాలి. గురువు యొక్క మాట అనుగ్రహం, చూపు అనుగ్రహం, అంతా అనుగ్రహమే. అటువంటి వారితో సహవాసం వలన నీ జీవితంలో మార్పు వస్తుంది. బాహ్యవస్తువులతోగాని, వ్యక్తులతోగాని సంబంధం లేని, బయటఉన్న వికారములతోగాని హెచ్చుతగ్గులతోగాని సంబంధంలేని సుఖాన్ని గురువు నీతో కలిసి తిరుగుతూ నీకు తెలియకుండానే మౌనంగా నీకు అందిస్తాడు, వాడు గురువు. గురువు నీలోపల కూడా ఉన్నాడు. నీ మొఖాన్ని లోపలకు త్రిప్పతూ, అటువైపు ప్రయాణించేటట్లు చేసి, తన అనుభవాన్ని మౌనంగా నీతోటి పంచుకొంటూ తనంతట వాడిని చేస్తాడు. అది అనిర్వచనీయం. భగవాన్ అరుణాచలేశ్వరుడితో ఏమన్నారు అంటే నీ దయవలన, నీ కరుణవలన నిర్విషయ ఆనందాన్ని, నిర్విషయ సుఖాన్ని తాగి, తాగి పొంగిపోయి మత్తెక్కి పోయి దేహస్పృహకాని, లోకస్పృహకాని లేనివాడినై సోమరినై పోయాను అన్నారు. అంటే భగవాన్ మనలాంటి వారు కాదు. మనం పనిని విడిచిపెడుతున్నాము కనుక మనం పని దొంగలం. భగవాన్ అలాకాదు ఆయన పనిని విడిచిపెట్టలేదు, పనే ఆయనను విడిచి పెట్టేసింది.

మీరు భక్తులకు బాగా సేవ చేస్తున్నారు, ఏమన్నా సంపాదించుకొన్నారా అని ఈమధ్య ఒక స్వాములవారిని రహస్యంగా అడిగాను. ఆయన ఏమి చెప్పారు అంటే నేను భక్తులకు ఎందుకు సేవ చేస్తున్నాను అంటే ఏదో సంపాదించుకోవటానికి చేయటం లేదు, కర్మ వాసనలు

పోగొట్టుకోవటానికి చేస్తున్నాను, అవి పోతున్నాయి అని చెప్పారు. నేను పని చేస్తాను, నేను పని చెయ్యను అని జ్ఞాని అనుకోడు. వాడు ఎవడు చెయ్యటానికి, చెయ్యక పోవటానికి, భగవంతుడి చేతిలో ఆ శరీరం పనిముట్టు కింద ఉంటుంది, ఆ శరీరం ద్వారా జరగవలసింది జరిగిపోతూ ఉంటుంది. మనకు ఇష్టమైతే చేస్తాము అంటాము, ఆ పని మనకు ఇష్టంలేకపోతే నేను చేయను అంటాము మనకు ఎంతసేపు ఇదే పని. జ్ఞాని మాత్రమే సుఖి. ఆయన సుఖి కాబట్టి ఆయన దగ్గరనుండి సుఖతరంగాలు, శాంతితరంగాలు ప్రవహిస్తూ ఉంటాయి. అంతేకాదు జన్మాంతరంలో నుండి వచ్చిన కర్మవాసనలు ఉంటే ఆ బండరాళ్లను మనకు తెలియకుండానే వాటిని దహిస్తూ ఉంటాడు. అగ్ని ఏవిధంగా అయితే అన్నింటిని దహించివేస్తుందో అలాగే జ్ఞాని యొక్క అనుగ్రహం, గురువు యొక్క అనుగ్రహం పుణ్యకర్మలను, పాపకర్మలను, నీ హృదయంలో ఉన్న చెత్తనంతా కాల్చి బూడిదచేస్తుంది. పుణ్యాన్ని కూడా గురువు కాల్చేస్తున్నాడు ఏమిటి అని అనుకోవద్దు ఎందుచేతనంటే పుణ్యం కూడా పునర్జన్మలను తీసుకొని వస్తుంది. అగ్నికి ఇది కాల్చాలి, ఇది కాల్చకూడదు అని ఏమీ ఉండదు. అలాగే గురువు అనుగ్రహం కూడా మొత్తం అంతటిని కాల్చి బూడిద చేస్తుంది. పునర్జన్మలను తీసుకొనివచ్చే వాటినన్నింటిని వరసపెట్టి కాల్చేయటమే వాడిపని, వాడు గురువు అంటే. గురువు యొక్క ఔన్నత్యం మనకు తెలియాలంటే ఆస్థాయి మనకు ఉండాలి. ఎదుటి మనిషి యొక్క విలువ మనకు తెలియాలంటే దానికి తగిన సంస్కారం మనకు ఉండాలి.

గురువు యొక్క దయ ఎలా ఉంటుంది అంటే ఈ మధ్య అరుణాచలంలో నాకు ఒక భక్తుడు చెప్పాడు. వాడు రమణభక్తుడు కాని వాడికి పాటలు, భజనలు అంటే ఇష్టం. రమణమహర్షి పుస్తకం నేను ఎవడను? చదువుతున్నాడు కాని దీనికంటే బాబా చెప్పిన మాటలు బాగున్నాయి అనిపిస్తోంది వాడికి. నేను ఎవడను? అని విచారణ చేసుకోండి మీ దుఃఖం నశిస్తుంది, ఆత్మజ్ఞానం పొందటానికి ఏ బలహీనతలు అయితే అడ్డువస్తున్నాయో అవిఅన్నీ కాలిపోతాయి అని చెపుతున్నారు కాని నాకు భజనలు అంటే ఇష్టంగా ఉంది, చనిపోయిన తరువాత స్వర్గానికి వెళతారు అంటే ఇష్టంగా ఉంది కాని ఈ అరుణాచలం వచ్చిపడ్డాను ఏమిటి అనుకొంటున్నారు. భగవాన్ వాడికి స్వప్నంలో కనిపించి నీ క్షేమం నాకు కావాలి, నీ సుఖం నాకు కావాలి షిరిడీ వెళ్ళు, బాబా దగ్గర ఆ సన్నిధిలో కొంతకాలం ఉ ఉండు. ఈ మాటలు అన్నీ ఎందుకు చెపుతున్నాను అంటే నేను అంటే నీకు ఇష్టంలేదు అనికాదు, నీ సంస్కారాలను బట్టి, నీ పూర్వజన్మ వాసనలను బట్టి కొంతకాలం షిరిడీలో జీవించు అని భగవాన్ చెప్పారు. కొంతకాలం షిరిడీలో ఉండి వచ్చాను అని చెప్పాడు. ఇక్కడ ఉండి ఏడుస్తూ కూర్చోవటం కంటే షిరిడీవెళ్ళి సుఖంగా ఉండు అని చెప్పారు, వాడు గురువు. గురువు యొక్క అనుగ్రహానికి గుర్తుగా స్వప్నంలోనికి వచ్చి చెప్పారు. బాబా చెప్పిన టీచింగ్ వైపుకు నీ మనస్సు పోతోంది, అక్కడికి వెళ్లటం వలన నీ సంస్కారం శాటిస్‌ఫై అవ్వటం వలన నీకు కొంత సుఖంగా తెలుస్తుంది. నువ్వు సుఖంగా ఉండటం నాకు

కావాలి అన్నారు వాడు గురువు అంటే.

విగ్రహాలను పూజిస్తున్నాము, యాత్రలు చేస్తున్నాము, నదులలో స్నానాలు చేస్తున్నాము అని అంటే భగవాన్ వాటిని ఏమీ ఖండించలేదు. తీర్థయాత్రలు మంచివే, విగ్రహారాధన మంచిదే, నామాన్ని స్మరించుకోవటం మంచిదే కాని ఒక సత్పురుషుడి చూపు దగ్గరకు ఇవి ఏమీ సరిపోవు. గురువు యొక్క దయాపూరితమైన చూపుముందు, ఆయన అనుగ్రహం ముందు ఇవి అన్నీ తక్కువే. ఏనుగు నిద్రపోతుంది అనుకోండి, ఆ స్వప్నంలో సింహం వచ్చింది అనుకోండి, భయం వలన ఏనుగుకు వెంటనే మెలకువ వచ్చేస్తుంది. ఇప్పుడు మనం అజ్ఞానమనే నిద్రలో ఉన్నాము. ఈ అజ్ఞానమనే నిద్రలో నుండి మనలను గురువు అనుగ్రహం అనే సింహం మాత్రమే మేల్కొలుపుతుంది. వంద మంది గురువులు అక్కరలేదు, ఆత్మానుభవం పొందినవాడు ఒక్కడు చాలు మనలను తరింపజేయటానికి. ఈ గురువు మంచివాడు కాదు అని కొంతమంది వేరొకచోటకు వెళ్ళిపోతూ ఉంటారు. వాళ్ళ సంస్కారానికి తగినట్లుగా ఇక్కడ లేనప్పుడు బయటకు పోతూ ఉంటారు అంతేగాని గురువు మంచివాడు కాకపోవటం కాదు, ఆయన మంచివాడు కాకపోతే ఆయన ద్వారా చాలామంది తరించారు కదా.

సాధారణంగా సాధన అంటే చాలా మందికి బాధగా ఉంటుంది, ఇష్టం లేనప్పుడు బాధ వస్తుంది. సాధన పేరు మీద బాధ లేకుండా నన్ను హృదయంలోనికి మేల్కొలిపావు, బ్రహ్మం అంటే ఎలా ఉంటుందో తెలియకుండానే దానిని పొందింపజేసి, ఆ వస్తువు ఎలా ఉందో అలా ఉండేటట్లు చేసావు అరుణాచలేశ్వరుడా అన్నారు భగవాన్. నీకు భక్తుడిగా ఉండే అర్హత నాకు లేకపోయినా, నీకు కొంతమంది భక్తులు ఉన్నారు కదా, ఆ భక్తులకు భక్తుడిగా ఉండేటట్లు నన్ను అనుగ్రహించు అరుణాచలేశ్వరుడా అన్నారు భగవాన్. నిజమైన గురువు సత్యం గురించి మాటలు ఎక్కువగా చెప్పడు. ఎందుచేతనంటే అది మాటలకు అందదు అని గురువుకు తెలుసు. ఆ వస్తువును సూచించటానికి, మిమ్మల్ని అక్కడకు నెట్టటానికి అవసరమయితే నాలుగు మాటలు చెపుతాడు కాని మాట కోసం మాటలు చెప్పడు, ఆడంబరం కోసం చెప్పడు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే మనుషులు అంతా రాగద్వేషములతో నిండి ఉంటారు, మీరు అటుచూడకండి, ఈ చావులు పుట్టుకలు వంక చూడకండి, గొడవలు అల్లర్లు విరోధాలు స్నేహాలు వీటివంక చూడకండి, ఇది అంతా ఒక మహాప్రవాహం. ఇటు చూస్తే సంసార ప్రవాహంలో కొట్టుకొని పోతారు. అందుచేత వాటివైపుకు చూడవద్దు. చైతన్యం వైపుకు, బ్రహ్మం వైపుకు చూడండి. భగవాన్‌తో మనం ఏదైనా తింగరమాటలు చెపుతూ ఉంటే ఇది జ్ఞానమా అంటారు. నువ్వు చెప్పేదంతా అజ్ఞానం అని అనరు, అది జ్ఞానమా? ఎందుకు ఇటువంటి మాటలు అంటారు. నువ్వు ఏదైనా మాట చెపితే ఇతరులు బాగుపడాలి, ఇతరులకు జ్ఞానం కలగటానికి ఆమాటలు సహకరించాలి. లేకపోతే పనికిరాని మాటలు అన్నీ వేసుకొని తిరగటం ఎందుకు.

భగవాన్‌తో ఫలానావారు మిమ్మల్ని విమర్శిస్తున్నారు, మీరు ఎన్నో మంచి పనులు చేస్తున్నారు అయినా వారు విమర్శిస్తున్నారు అని అంటే భగవాన్ ఏమి చెప్పారు అంటే వారు అలా అన్నారు, వీరు ఇలా అన్నారు అని వారి గొడవలలోనికి వెళ్లే బదులు మనం సహనాన్ని పెంచుకొంటే సరిపోతుంది అనేవారు. మనం కూడా తిరిగి విమర్శలు మొదలు పెట్టాము అనుకోండి ఆ సంసారంలో పడిపోతాము, అజ్ఞానంలో పడిపోతాము. పాండిత్యానికి జ్ఞానానికి ఏమీ సంబంధం లేదు, డబ్బుకి జ్ఞానానికి ఏమి సంబంధం లేదు, అధికారానికి జ్ఞానానికి ఏమీ సంబంధం లేదు. ఇవన్నీ లోకానికి సంబంధించిన విషయాలు. నీకు ఆత్మానుభవం కలగాలంటే ఆత్మవిచారణ చేసి తీరాలి. నువ్వు ఆత్మవిచారణ ప్రారంభిస్తే వెంటనే నీకు మోక్షం అందకపోయినా, స్వర్గరాజ్యం నీకు అందకపోయినా ఆ ప్రయాణంలో నీకు ఉన్న మానసిక రుగ్మతలు, అశాంతి నెమ్మదిగా కాలి బూడిద అవుతూ ఉంటాయి అంటున్నారు భగవాన్. ఇప్పుడు మీరు ఎవరైనా నన్ను విమర్శించారు అనుకోండి నాకు దుఃఖం వస్తుంది. దుఃఖం శరీరానికి కాదు, మనస్సుకు వస్తుంది. మనస్సుకు దుఃఖం ఎందుకు వస్తుంది? ఆ మనస్సే నేను అనుకోవటం వలన దుఃఖం వస్తుంది. నా స్థూలశరీరంతో నాకు ఎంత తాదాత్మ్యం ఉందో, నా సూక్ష్మశరీరంతో నాకు ఎంత తాదాత్మ్యం ఉందో, అంత తాదాత్మ్యం లోపలఉన్న సద్వస్తువుతో కనుక నాకు ఉంటే జ్ఞానం రాకుండా ఎలా ఉంటుంది? లోపల ఉన్న సద్వస్తువుతో మనకు తాదాత్మ్యం వచ్చినప్పడు మనం ఏ వస్తువును తెలుసుకోవాలి అనుకొంటున్నామో ఆ వస్తువు దగ్గరకు మనం వెళ్లటం కాదు, ఆ వస్తువే మనగుమ్మంలోనికి వచ్చి, మన తలుపు తడుతుంది, మనలను వరిస్తుంది. మన పిల్లవాడిని ఎవరైనా కొట్టారు అనుకోండి, ఆ కొట్టిన వాడిమీద మనకు ఎంతో కోపం వచ్చేస్తుంది. ఎందుచేత మీ బిడ్డతో మీకు ఉన్న తాదాత్మ్యం వలన మీకు అంత కోపం వస్తుంది. అటువంటి తాదాత్మ్యం హృదయంలో ఉన్న వస్తువు మీద రావాలి. హృదయంలో ఉన్న సత్యంతో మీకు నూటికి నూరుపాళ్ళు తాదాత్మ్యం రావాలి.

సజ్జన సాంగత్యం వలన సడన్‌గా వాతావరణం మారిపోతుంది, అంతకు ముందు నీ మనస్సు ఎలా ఉన్నప్పటికీ, మనస్సులో దుష్టసంకల్పాలు, దుష్టఆలోచనలు ఎన్ని ఉన్నప్పటికీ ఆ వాతావరణంలో ఇవన్నీ పోతాయి, నీకు సహృదయం కలుగుతుంది, సద్బుద్ధి కలుగుతుంది, బాగుపడే ఆలోచనలు, తలంపులు వస్తాయి. మనం సత్పురుషులతో సహవాసం చేయటం వలన రెండు లాభాలు, మనం భౌతికంగా అభివృద్ధిలోనికి వస్తాము, ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వస్తాము. నేను ధ్యానం చేస్తున్నాను, జపం చేస్తున్నాను, చాలా కష్టపడి సాధనలు చేస్తున్నాను అయినా నా మనస్సు నిలబడటం లేదు ఇటువంటి గొడవలు ఏమీ అక్కరలేకుండానే ఒక మహాగురువు సమక్షంలో, జ్ఞాని సమక్షంలో నీకు తెలియకుండానే నీ ప్రయత్నంతో సంబంధం లేకుండానే నీ మనస్సు యొక్క చాపల్యం ఆగిపోతుంది, నీ మనస్సు నిర్మలమవుతుంది, అక్కడితో ఆగదు, ఏ స్థితిలో ఉన్నప్పడు నీ హృదయంలో ఉన్న సత్యం నీకు గోచరమవుతుందో అటువంటి సమాధిస్థితికి గురువు నిన్ను తోలుకొనిపోతాడు.

ఒకవేళ నీవు ఏదైనా తప్పుడు ఆలోచనలో ఉంటే ఆ రాంగ్ తింకింగ్‌లో నుండి నిన్ను రైట్ తింకింగ్‌లోనికి, రాంగ్ ఏక్షన్‌లోనుండి రైట్ ఏక్షన్‌లోనికి నిన్ను మళ్ళించి, తను ఏ అమృతానుభవం అయితే పొందాడో ఆ అనుభవాన్ని నీకు తెలియకుండానే ఆయన అనుగ్రహిస్తాడు, వాడు గురువు. ఎందుచేతనంటే గురువుకు గుర్తింపులు అక్కరలేదు, అక్కడ ద్వైతం లేదు.

భగవాన్ అంటున్నారు అసలు మాటే అహంకారం, నోరు మెదిపావా అహంకారం వచ్చేస్తుంది, ద్వైతం వచ్చేస్తుంది, బేదబుద్ధి వచ్చేస్తుంది, నోరు మెదపకు, సాధ్యమయినంత వరకు నోరు మూసుకొని పడి ఉండు. నోరు మెదిపావా నేను ఇలా చెపుతున్నాను, నేను అలా చెపుతున్నాను అని అహంకారం వచ్చేస్తుంది, అజ్ఞానం పెరిగిపోతుంది. ఎంతో తప్పనిసరి అయితేనేగాని నోరు మెదపకు. నోరు మెదిపావా ద్వైతం వస్తుంది, ద్వైతం వలన శోఖం వస్తుంది, ద్వైతం వలన భయం వస్తుంది, ద్వైతం వలన జన్మలు వస్తాయి, కోరికకు కారణం ద్వైతం. రోజూ మనం చెప్పే ప్రతీమాటా అహంకారమే. ఏదో వాళ్ళను ఉద్ధరించాను, ఆపని చేసాను అని 24 గంటలు వారిని వారు పొగొడుకోవటం, ఇతరులను నిందించటం ఇదే మనకు పని. మన మాట ఎవరికయినా శాంతిని కలుగజేస్తోందా, మన మాట జ్ఞానం కలగటానికి ఎవరికయినా సహకరిస్తోందా అని చూసుకొంటే మనకే తెలుస్తుంది. ఇప్పడు మీకు కూర్చోవటం బాధ, నాకు చెప్పటం బాధ. మీకు మోకాళ్ళు నెప్పలు, నాకు నోరు నెప్పి. వస్తువు అనుభవంలోనికి వచ్చేవరకు గురువు యొక్క వైభవం మనకు తెలియదు. వస్తువు అనుభవంలోనికి వచ్చాక ఇది అంతా గురువు యొక్క దయ అని అప్పడు మనకు తెలుస్తుంది, గురువు యొక్క అనుగ్రహం తప్పించి ఇక్కడ ఏమీ లేదు అని వస్తువు అనుభవంలోనికి వచ్చాక తెలుస్తుంది. అక్కడ కొబ్బరి మొక్క వేశాము, ఇక్కడ నుయ్యి తవ్వించాము, అక్కడ పదిమందికి సహాయం చేసాను అని ఇలా ఏదో చెపుతూ ఉంటాము. కాని గురువు మనలను అక్కడ ఆగనివ్వడు. ఇదే గమ్యం అనుకోకు, నీవు పొందవలసింది వేరే ఉంది. ఇవి అన్నీ స్వప్న సమానము అని నీకు తెలియజేసి, గమ్యం దగ్గరకు నిన్ను తోలుకొనిపోతాడు, వాడు గురువు. ఎందుచేతనంటే ఇవి అన్నీ నిజం కాదు అని గురువుకు తెలుసు. నిన్ను మంచి పనులు చేయవద్దు అని చెప్పడు, నిన్ను ఖండించడు, నిన్ను ఉద్ధరిస్తాడు, వాడు గురువు. గురువు నీతో మాట్లాడుతూ ఉంటాడు, నీతో కలిసి తిరుగుతాడు, నిన్ను కోపగించుకొంటాడు, కేకలు వేస్తాడు. గురువు యొక్క కోపం కూడా అనుగ్రహమే అని గుర్తించిన వారు ధన్యులు. భగవాన్ కూడా ఒకోసారి ఎదురుగా కూర్చొన్న వారితో మాట్లాడే వారు కాదు, చివర కూర్చొన్న వాడిని దగ్గరకు పిలిచి మీరు భోజనం చేసారా అని అడిగేవారు. ఎదురుగా కూర్చొన్న వాడికి కోపం వచ్చేది, మంట వచ్చేది. భగవాన్ కావాలనే అలాగ చేసేవారు ఎందుచేతనంటే లోపల ఉన్న మంట అంతా బయటకు రావాలి. లోపల ఎంత ఉందో అది మీకు తెలియాలి. అది తెలిస్తేనేగాని, మనం ప్రయత్నం చేయము, అది బయటకు పోదు. ఏదో వేప చెట్టు వేసాను, నా జీవితానికి సరిపోతుంది అనుకొంటారు

అనుకోండి, గురువు ఏమి చేస్తాడు అంటే ఏదో వేపచెట్టు వేసావులే, మంచిపని చేసావులే, ఇదే సర్వస్వం అనుకోకు, నువ్వు పొందవలసింది వేరే ఉంది, ముందుకు నడువు అని నిన్ను గెంటుకొంటూ ముందుకు పోతాడు, వాడు గురువు. రమణభగవాన్ చెప్పేది ఏమిటి అంటే ఈ దేహమే సత్యం, ఈ లోకమే సత్యం అని ఈ దేహం మీద, ఈ లోకం మీద నీకు సత్యబుద్ధి ఉన్నంతకాలం, ఇదే సత్యం అనుకొన్నంతకాలం నీ మనస్సు లోపలకు వెళ్లదు, నీకు ఆత్మజ్ఞానం కలుగదు, ఇలా నీవు కోటి జన్మలు ఎత్తినా నీ గతి ఇంతే. మనస్సుకు లోచూపు నేర్పు, మనస్సు దాని మూలమైన హృదయంలో అది నిలబడి ఉండేటట్లు చూడు. హృదయంలో మనస్సును ఉంచటం వలన అది నెమ్మదిగా సన్నగిల్లి నశిస్తుంది, అప్పుడు అక్కడ ఉన్న సత్యవస్తువు నీకు అనుభవంలోనికి వస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 01-12-04, చిన అమిరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఇది దత్తసాయి మందిరం. దత్తాత్రేయుడి యొక్క అంశే షిరిడీ సాయిబాబా అని చెపుతారు. దత్తాత్రేయుడు అంటే అత్రిమహర్షికి దత్తుడుగా వచ్చిన నారాయణుడే దత్తాత్రేయుడు. దత్తాత్రేయుడు మహాగురువు. గురువు అంటే అక్కడ రెండు కాళ్ళు, రెండు చేతులు పెట్టుకొన్న మామూలు వ్యక్తిగా చూడనక్కరలేదు. గురు స్వరూపం అంటేనే జ్ఞాన స్వరూపం, శాంతి స్వరూపం. దత్తాత్రేయుడు దగ్గర ఎప్పుడూ కల్లుకుండలను పెట్టుకొని ఉండేవాడు. ఈ తాగుబోతు మనకు గురువు ఏమిటి అని మామూలు జనం ఆయనను చూసి వెళ్ళిపోయేవారు. ఆయన యొక్క విలువ, ఆత్మజ్ఞానం యొక్క వైభవం తెలిసిన వారు ఆయన దగ్గరకు వచ్చి ఆయన బోధను వినేవారు అంటే లోతుమనుషులు మాత్రమే ఆయనను ఆశ్రయించి జ్ఞానాన్ని సముపార్జనచేసి మోక్షాన్ని పొందారు. దత్తుడిని స్మరించుకొంటూ ఉంటేనే చాలామందికి అనేక మహిమలు జరిగాయి. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే. అదే బ్రహ్మం. ఆ బ్రహ్మం యందు జగత్తు, జీవుడు, ఈశ్వరుడు కల్పించబడ్డాయి. ఏ బ్రహ్మం యందు ఈ మూడు కల్పించబడ్డాయో ఆ బ్రహ్మజ్ఞానం కావాలంటే, మీరు బ్రాహ్మీస్థితిని పొందాలంటే సుబ్రహ్మణ్యుడిని ఆరాధించమని పెద్దలు చెపుతారు, అది పారమార్థికం. ఇంక లౌకిక విషయాలలో మీ ఇంట్లో పెండ్లి ఆలస్యం అవుతూ ఉంటే, మీకు సంతానం లేకపోతే సుబ్రహ్మణ్యుడిని ఆరాధించమని పెద్దలు చెపుతూ ఉంటారు. శివుడి యొక్క మరో రూపమే సుబ్రహ్మణ్యుడు.

అందరకు జ్ఞానం కలగాలి, శాంతి కలగాలి, బ్రహ్మానందానికి అందరూ వారసులు అవ్వాలి అయితే లోపం ఏమిటి అంటే చదువుతున్నాము, పారాయణలు చేస్తున్నాము, సాధన చేస్తున్నాము కాని మనకు శ్రద్ధ లేదు. శ్రద్ధలేకపోతే జ్ఞానంరాదు. పెద్దలు చెప్పిన మాటలు వింటున్నాము కాని మనకు ఉండవలసినంత శ్రద్ధ లేదు. భగవంతుడు మనకు కొన్ని తెలివితేటలు ఇచ్చాడు కాని